# పాండురంగాశ్రమంలో ఘనంగా ఏకాదశి వేడుకలు

## పాండురంగస్వామిని దర్శించుకుంటున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**మర్కుక్, జూలై 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాండురంగాశ్రమంలో తొలి ఏకాదశి సందర్భంగా వేడుకలను వేలాదిమంది భక్తజనుల మధ్య వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నుండే స్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చి శ్రీపాండురంగస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనానికి చేరుకున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అల్పాహారం, టీ సౌకర్యాలు కల్పించారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు హైద్రాబాద్‌కు చెందిన కొడకండ్ల రాధాకృష్ణశర్మ బృందం, చుంచనకోటకు చెందిన లలితామతిశర్మ తదితరుల కార్యక్రమాలు భక్తి సంగీత విభావరి అందరినీ ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రానికల్లా ఎటు చూసినా ఆశ్రమ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. మహా అన్న ప్రసాదంలో వేల సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# నేటి నుంచి రూ.లక్ష లోపు రుణాల మాఫీ ప్రారంభం

**జగదేవ్‌పూర్/మర్కుక్, జూలై 17 (ప్రభాతవార్త):** నేటి నుండి రూ.లక్షలోపు బ్యాంకులలో అప్పు ఉన్న రైతులకు మాఫీ వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి వసంతరావు తెలిపారు. ఈనెల 18వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రుణమాఫీ పథకం ప్రారంభమవుతుందని, అదేవిధంగా రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లబ్దిదారులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండలంలోని తిగుల్ రైతువేదికలో నిర్వహిస్తున్నామని, రైతులు పెద్దసంఖ్యలో హాజరై రుణమాఫీ సంబరాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**మర్కుక్‌లో...**

మొదటి దఫాలో భాగంగా నేటి నుండి రూ.లక్ష లోపు రుణాల మాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రుణమాఫీ లాంచనంగా ప్రారంభించి లబ్దిదారులతో ముఖాముఖి మాట్లాడుతారని ఏఓ నాగేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం మర్కుక్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడనున్నారని తెలిపారు. ఈ రుణమాఫీ సంబరాలకు మండలంలోని రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# నేడు డాకూరుకు మంత్రి దామోదర్ రాక

**జోగిపేట, జూలై 17, ప్రభాతవార్త:** ఈ నెల 18న అందోలు మండలం డాకూరు గ్రామానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతున్నట్లు అక్సాన్‌పల్లి సొసైటీ చైర్మెన్ నరెందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రుణ మాఫీ పథకంలో భాగంగా మొదటి విడత రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమచేస్తున్న సందర్భంగా మంత్రి దామాదర్ రాజనర్సింహ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. డాకూరులోని రైతువేదికలో సాయంత్రం 4గంటలకు రైతులతో కలిసి నిర్వహించే రుణమాఫీ సంబరాల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి రైతులు కూడా అధికసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

# నేత్ర పర్వంగా లింగార్చన మహోత్సవాలు

## -హాజరైన గరికపాటి నరసింహారావు, జగద్గురువు




గరికపాటి నరసింహారావుకి బసవేశ్వర చిత్ర పటాన్ని అందచేస్తున్న జగద్గురువు చంద్రశేఖర్ శివాచార్య

**సదాశివపేట, జూలై 17, ప్రభాతవార్త:** పట్టణంలోని చౌకి మఠంలో వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో శివ పంచాక్షరి కోటి జప యజ్ఞం, సామూహిక ఇష్టలింగార్చన మహోత్సవ కార్యక్రమాలు శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వర జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహా స్వామి ఆధ్వర్యంలో నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన మహోత్సవాలకు మహా సహస్ర అవధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు హాజరై మహాస్వామిని దర్శించుకుని భక్తులకు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమానికి హాజరైన గరికపాటి నరసింహారావుకు జగద్గురువు చంద్రశేఖర శివాచార్య విశ్వగురువు మహాత్మా బసవేశ్వర చిత్ర పటాన్ని బహుకరించి ఆశీస్సులు అందచేశారు. ఈ సందర్భంగా గరికపాటి నరసింహారావు ప్రవచనాలు చేస్తూ ఓం నమ శివాయ అనే పంచాక్షరి మంత్రం సర్వ శ్రేయోస్కారమన్నారు. నిత్యం కొంత సమయాన్ని ఆధ్యాత్మికకు కేటాయించాలని, ఫలితంగా రోజంతా ప్రశాంతంగా సాగుతుందన్నారు. మహాత్మా బసవేశ్వరుడు మనవతా వాది అని, అందరికి భక్తిమార్గంలో పయనింపచేసిన మహానుబావుడని కొనియాడారు. మహాత్మా బసవేశ్వరుడు సూచిన బాటలో వీరశైవ సమాజం చౌకి మఠం సమాజం ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు లోక కళ్యాణార్థం నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం చౌకి మఠం అధ్యక్షులు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, సభ్యులు, మహిళా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# టి.బిసి సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పయ్యావుల గిరి

**సిద్దిపేట అర్బన్, జూలై 17, ప్రభాతవార్త:** తెలంగాణ బీసీ సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన పయ్యావుల గిరి నియామకమయ్యారు. ఈ మేరకు హైదారాబాద్‌లోని కార్యాలయంలో బీసీ సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాని రామకృష్ణగౌడ్ నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పయ్యావుల గిరి మాట్లాడుతూ తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు అధ్యక్షులు ప్రతాని రామకృష్ణగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సాధికారత కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# శివాలయంలో న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

**నర్సాపూర్, జూలై 17, ప్రభాతవార్త :** తొలి ఏకాదశి పండగ పురస్కరించుకొని బుధవారం నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి కె.అనిత కుటుంబ సమేతంగా శివాలయంలో, శ్రీలక్ష్మినారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు, వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోసాలతో ఉండాలని, అదేవిధంగా వర్షాలు సమృద్ధిగా కురిపించి చల్లంగా చూడాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు. తొలిఏకాదశీ, మొహర్రం(పీర్ల) పండగల సందర్భంగా ప్రజలందరికి న్యాయమూర్తి కే.అనిత శుభాకంక్షలు తెలియజేశారు.

# రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేయాలంటూ కాలనీ వాసుల ధర్నా

**హుస్నాబాద్ రూరల్, జూలై 17, ప్రభాతవార్త :**

హుస్నాబాద్ మున్సిపాలిటీలోని 8,9వ వార్డులలోని బుడగ జంగాల కాలనీ నుండి ఆరెపల్లి చౌరస్తా వరకు ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తతం చేశారు. బుధవారం ధ్వంసమైన రోడ్డుకు వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడగ జంకాల కాలనీ నుండి ఆరెపల్లి చౌరస్తా వరకు గల ఈ రోడ్డుపైనే పొట్లపల్లి, ఎఆర్ఎమ్ రైస్‌మిల్, గ్యాస్ గోదాం, దేవేంద్ర నగర్‌లోని క్వారీకి వెళ్లే భారీ వాహనాలు, లారీలు వెళ్తుంటాయని తద్వార రోడ్డు మొత్తం ధ్వంసమైందన్నారు. ధ్వంసమైన రోడ్డుపై ప్రయాణం చేసే ప్రయాణికులు అనేక మంది గుంతలలో పడి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. గతంలోనే ఈరోడ్డు మంజూరైందని కానీ పనులు ఎందుకు ప్రారంభించడంలేదో తమకు అర్థం కావడం లేదన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు స్థానిక మున్సిపల్ అధికారులు చొరవ చూపి రోడ్డుకు శాశ్వత మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షులు నమిలికొండ రాజయ్య, యాదవ సంఘం అధ్యక్షులు గొర్ల లింగయ్యయాదవ్, యూత్ అధ్యక్షులు నమిలికొండ రాంబాబు, ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, కాలనీవాసులు మీలుగూరి రవీందర్, తిరుమలేష్, గడిపె సతీష్‌కుమార్, కొమురయ్య, బ్రహ్మచారి, ప్రవీణ్‌రెడ్డి, ఒదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

# 10 శాసనసభ స్థానాల్లో ఉప ఎన్నికలు తధ్యం

## -కాంగ్రెస్ బస్సు హామీ తప్ప అన్నీ తుస్సే
## -మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



మాట్లాడుతున్న హరీష్‌రావు

**రామచంద్రాపురం, జూలై 17, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు తధ్యమని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలో బిఆర్ఎష్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీస్పీకర్ మధుసూదనాచారి, మాజీ శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ, భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఆరంభం సమయంలో పిడికెడు మందితోనే ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ప్రత్యేక రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పెట్టిన ఇబ్బందులు చెప్పనలవిగా ఉన్నాయని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమవైపు తీసుకుంటున్నారని, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి బిఆర్ఎస్ పార్టీ ఏం అన్యాయం చేసిందని, అధికారంలో లేనప్పుడు కష్టాలు వస్తాయని తట్టుకోలేక గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీని వీడటం అన్యాయమన్నారు. పటాన్‌చెరుకు బిఆర్ఎస్ ప్రభుత్వం నిధుల వరద పారించిందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని ధైర్యం నూరిపోశారు. సుప్రీంకోర్టును ఆశ్రయించి పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉప ఎన్నికల జరగడం తధ్యమన్నారు. కాంగ్రెస్ చేసిన 6 గ్యారంటీల్లో ఒక్క బస్సు హామి తప్ప అన్ని హామీలను తుస్సు మనిపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, బొల్లారం మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బి రాములుగౌడ్, మాజీ కార్పొరేటర్‌లు శంకర్‌యాదవ్, అంజయ్యయాదవ్, బిఆర్ఎస్ నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జిటిలకు పదోన్నతులు కల్పించాలి

## యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సాయిలు




మాట్లాడుతున్న సాయిలు

**నారాయణఖేడ్, జూలై 17 ప్రభాతవార్త:**

ఇటీవల రాష్ట్రంలో ఉపాధ్యాయులకు బదిలీలకు ప్రభుత్వం అవకాశంకల్పించింది. మిగిలిపోయిన ఉపాధ్యాయ ఖాళీలతో ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే రిలీవ్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇచ్చి, పెండింగ్‌లో ఉన్న బిల్స్‌ను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటిఎఫ్) సంగారెడ్డి జిల్లాకార్యాలయ బేరర్స్ ప్రాంతీయ సమావేశం నారాయణఖేడ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు జె.కాశీనాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కె.అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తొమ్మిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ పదోన్నతులు నిర్వహించడం, ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు చేపట్టడం అభినందనీయమన్నారు. మిగిలిన ఖాళీలలో వెంటనే ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని, బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాద్యాలందరిని వెంటనే రిలీవ్ చేయాలని, అవసరమైన మేరకు తాత్కాలిక ఉపాధ్యాయులను (విద్య వలంటీర్లను) నియమించాలని వారు డిమాండ్ చేశారు. బదిలీల్లో స్పౌస్ వినియోగించుకున్న ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా తమ భాగస్వామికి దగ్గర పాఠశాల కాకుండా వేరే పాఠశాలకు బదిలీ పొందిన వారికి పనిష్మెంట్ కింద వారిని ఆ ప్లేస్ మార్చి లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలలో స్పౌస్‌కి దగ్గరగా ఉన్న పాఠశాలలకు బదిలీలు చేయాలని వారన్నారు. బదిలీ ప్రకియలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుల వెబ్ ఆప్షన్ ఇచ్చే సందర్భంలో సమయం ఎక్కువగా ఇవ్వకపోవడం, ఎడిటన ఆప్షన్ ఇవ్వకపోవడం వల్ల ఉపాధ్యాయులు గందరగోళ పడి తప్పిదాలు దొర్లయన్నారు. ఇయర్స్ సరెండర్ తదితర బిల్స్ చాలకాలంగా పెండింగ్‌లో ఉన్నయని వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లాకార్యదర్శులు బి.ఏశప్ప, ఎం.నరేష్, మండల నాయకులు హరిసింగ్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# హలో మాదిగ.. ఛలో యాదగిరిగుట్ట

## -ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్‌రెడ్డి ఎర్రోళ్ల సంజీవయ్య



మాట్లాడుతున్న పుర్ర ప్రభాకర్‌రెడ్డి

**కొల్చారం, జూలై 17 ప్రభాతవార్త:**

ఈ నెల 19న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న నాయకత్వంలో యాదగిరిగుట్టలో జరగబోయే ఎమ్మార్పీఎస్ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్‌రెడ్డి ఎర్రోళ్ల సంజీవయ్యలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో వారు మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరగాల్సిందే అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మీ ఆస్తుపాస్తులు అడగం లేదని, మాకు కావాల్సింది ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అన్నారు. అందుకోసం ఎమ్మార్పీఎస్ దీర్ఘమైన పోరాటం చేస్తున్నప్పటికీ మొదటిసారి కేంద్రంలో అధికారం రాగానే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని, మూడోసారి కేంద్రంలోకి వచ్చిన తరువాత కూడా వర్గీకరణ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. వర్గీకరణ చేస్తే నరేంద్ర మోడీ పాలాభిషేకం చేస్తామన్నారు. వర్గీకరణ చెయ్యకపోతే మాదిగలను మోసం చేసిన ఏకైక ప్రధానమంత్రిగా మిగిలిపోతారని అన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య బారతదేశంలో మాదిగ ఉపకులాలు చాలా వెనబడి పోయాయని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేస్తూ నాణ్యమైన విద్య, వైద్యం పేదలకు అందించాలని డిమాండ్ చేశారు.

# రైతులపై కాంగ్రెస్ నేతల దౌర్జన్యం ఆపాలి

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



రైతు కిష్టయ్యను ఆర్‌విఎం ఆసుపత్రిలో పరామర్శిస్తున్న హరీష్‌రావు

**ములుగు, జూలై 17 (ప్రభాతవార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్య రాజకీయాల వల్ల ఎంతో మంది అమాయక రైతులు బలి అవుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన బండి కిష్టయ్య అనే యువ రైతు రెండు రోజుల క్రితం భూ వివాదంతో ఆత్మహత్యాయత్నం చేసుకోగా ప్రాణాపాయ స్థితిలో ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌విఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు బుధవారం ఆర్‌విఎం ఆసుపత్రికి చేరుకొని రైతు కిష్టయ్యను, అతని కుటుంబసభ్యులను పరామర్శించి వారికి జరిగిన అన్యాయంకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకొని వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతు కిష్టయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులతో మాట్లాడి హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించేవిధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి రైతు బండి కిష్టయ్యకు జరిగిన అన్యాయంపై పూర్తి వివరాలు తెలియజేసి అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారులతో విచారణ జరిపించి రైతుకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేద ప్రజలను, రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా పేదల భూములను కబ్జా చేస్తూ అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారికి వత్తాసు పలికేవిధంగా మార్చుకుంటున్నారని అన్నారు. బండి కిష్టయ్య అనే పేద రైతు తన భూమి హద్దులు చూపించాలని సర్వే కోసం అప్లై చేస్తే అక్కడికి వచ్చిన డిఐ ముందు సర్వే చేసి హద్దులు పెట్టారని, ఆ తర్వాత కాంగ్రెస్ నాయకులు అందరి ముందే అధికారికి ఫోన్‌చేసి వారిపై ఒత్తిడి తెచ్చి రెండోసారి సర్వే చేయించారని, రెండోసారి సర్వే చేస్తే హద్దులన్నీ మార్చేసి ఆ రైతు పొలానికి దారి లేకుండా చేశారని తెలిపారు. రైతు కిష్టయ్యను కాంగ్రెస్ నాయకులు రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రైతు రూ.50వేలు ఇచ్చి ఒప్పంద పత్రం రాసుకున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రూ.3 లక్షలు సరిపోవు 20 లక్షలు కావాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో రైతుపై కేసు పెట్టి వేధించడంతో ఆందోళనకు గురైన రైతు కిష్టయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు హరీష్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పెద్దల అండదండలతో చెలరేగిపోతున్న పార్టీ నాయకులపై ముఖ్యమంత్రి, డిజిపిలు చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ నాయకుల వల్ల ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన రైతు కిష్టయ్యకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ సంఘటనపై రెవెన్యూ శాఖ అధికారులు పూర్తి విచారణ జరిపి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. ఆయన వెంట మాజీ స్పీకర్ మధుసూదన్‌చారి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మైనార్టీ రాష్ట్ర నాయకుడు జుబేర్ పాషా, గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఏఎంసి మాజీ ఉపాధ్యక్షుడు కోడూరు భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి లింగ హరిబాబు, మాజీ రైతు సమితి అధ్యక్షుడు సందుగారి నర్సింహారెడ్డి, నాయకులు నగేష్, మల్లేశ్‌యాదవ్, నూనె వెంకటేష్‌యాదవ్, మహేష్‌యాదవ్, సత్తయ్య చారి తదితరులు ఉన్నారు.

# రైతు రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, జూలై 17, ప్రభాతవార్త :** రైతుల అభివృద్ధికి పాటుపడుతూ రైతు రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో రైతులకు ఎలాంటి రుణమాఫీ చేయని పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతులు మోసపోయారన్నారు. ఈ మోసపోయిన రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన రుణమాఫీ రైతులకు గొప్పవరంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని నిరూపించుకుందని అన్నారు నేటి నుండి రైతుల ఖాతాలో రుణమాఫీ డబ్బులు పడతాయని తెలిపారు. నేడు లక్ష రూపాయిల రుణం ఉన్న రైతులకు రుణమాఫీ మొదటి విడతలో అవుతుండగా రెండవ విడతలో లక్షా యాబై వేల రుణమాఫీ అవుతందన్నారు. మూడవ వితలో మొత్తం 2 లక్షల రుణమాఫీ రైతులకు ఇవ్వడం జరుగుతందని ఆయన తెలిపారు. ఈ మేరకు నేడు సాయంత్రం జిల్లాలోని అన్ని మండలాల్లోని రైతు వేదికల వద్ద జరిగే రుణమాఫీ సంబరాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరిలి వచ్చి వజయవంతం చేయాలని ఆంజనేయులుగౌడ్ కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ బిసి సెల్ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ విషయాల్లో రౌడీషీటర్లు తలదూర్చొద్దు

## -డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి



రౌడీ షీటర్‌ను హెచ్చరిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, సిఐ రవి

**జహీరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** రౌడీ షీటర్లు కుటుంబాల విషయాల్లో తలదూర్చవద్దని డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ సిఐ ఆర్ రవిలు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని రౌడీ షీటర్లు అబేలి, సమి, రఫీ, ఖదీర్‌లకు పలు సూచనలు చేశారు. రౌడీ షీటర్లు సత్‌ప్రవర్దనతో ఉండాలని, నేరాల వైపు చూడవద్దని హెచ్చరించారు. ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తే పిడి యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కాశీనాథ్ ఉన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ మధు

# గంజాయి విక్రేతల అరెస్ట్

## 4 కిలలో గంజాయి, 9 సెల్‌ఫోన్లు, ఒక కారు, రూ.23 వేల నగదు స్వాధీనం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లా కేంద్రంలోని కెసిఆర్‌నగర్‌లో గంజాయి తాగడంతోపాటు అమ్ముతున్న 9 మంది వ్యక్తులను నుంచి 4 కిలలో గంజాయి, 9 సెల్‌ఫోన్లు, ఒక కారు, రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధు తెలిపారు. బుధవారం టూ టౌన్ పోలీసు స్టేషనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశ ంలో వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూంల ప్రాంతంలో గంజాయి తాగడంతోపాటు అమ్ముతున్నాని వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, టూ టౌన్ పోలీసులు దాడి చేసినట్లు తెలిపారు. కోహెడ మండలం బసాపూర్ గ్రామానికి చెందిన బానోతు గణేష్(21) టిఎస్‌సి3ఎఫ్‌జి3445 నంబరుగల వాహనంలో తీసుకవచ్చి దోభిగల్లికి చెందిన అంతగిరి గణేష్(21), కెసిఆర్ నగర్‌కే చెందిన పొన్నాల కుమార్, మిట్టపల్లికి చెందిన కర్ణాకర్, సిద్దరబోయిన అఖిల్, నారాయణరావుపేట చందు, దోభిగల్లికి చెందిన కానిగంటి గణేష్‌లకు గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 4 కిలోల గంజాయి, కారు, 9 సెల్‌ఫోన్లు, రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. టూ టౌన్ సీఐ బి.ఉపేందర్, టాస్క్‌ఫోర్స్, అధికారులు పాల్గొన్నారు.

# పత్తి చేనులో గంజాయి సాగు

## రైతుపై కేసు నమోదు

**పుల్కల్, జూలై 17, ప్రభాతవార్త:** పత్తి చేనులో గంజాయిని సాగు చేస్తున్న రైతుపై కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు. మండల పరిధిలోని మంతూర్ గ్రామానికి చెందిన దూదేకుల శ్యాము పొట్ట భూమిలో అదే గ్రామానికి చెందిన రైతు దండు ఇనాయక్ అలీ భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేస్తున్నాడన్నారు. పత్త పంటలో అంతర్ పంటగా గంజాయిని సాగు చేస్తూ వస్తున్నాడన్నారు. విషయం తెలుసుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, జోగిపేట సిఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ క్రాంతి కుమార్‌లు పొలాన్ని పరిశీలించి రైతు గంజాయినా సాగు చేస్తున్నట్లు గుర్తించి రైతుపై కేసు నమోదు చేశామన్నారు.



పత్తి చేనులో గంజాయి మొక్కలను పెంచుతున్న దృశ్యం




## ఘనంగా మొహర్రం వేడుకలు

**వెల్దుర్తి, జూలై 17 ప్రభాతవార్త:** మొహర్రం పండుగ సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం కులమతాలకు అతీతంగా పీర్లను ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని మంగళపర్తి, కుకునూర్, మాసాయిపేట గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మగవాళ్లు, యువత పీర్ల ముందు అస్సైదుల్లా అంటూ ఆటపాటలు పడుతూ సంతోషంగా పీర్లను ఎత్తుకున్నారు. అలాగే పీర్లు ఒకే దగ్గర కలుసుకోవడంతో అక్కడ పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా సంతోషంగా పండుగను జరుపుకోవడం జరిగిందని పలు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మొహర్రం అనగానే పీర్ల ఊరేగింపే గుర్తుకు వస్తుందని, ధర్మ యుద్ధంలో వీర మరణం పొందిన ప్రవక్తలను, వీర పురుషులను ప్రతిష్ఠించి జ్ఞాపకం చేసుకుంటారు.

**శివ్వంపేట మండలంలో...**

**శివ్వంపేట, జూలై 17 ప్రభాతవార్త:** మండలకేంద్రంతోపాటు గూడూరు, నవపేట్, గోమారం, బిజిలీపూర్, పిల్లుట్ల, రత్నాపూర్, కొత్తపేట గ్రామాల్లో ఘనంగా మొహర్రం వేడుకలు నిర్వహించారు. బిజిలీపూర్ గ్రామంలో పీర్ల ఊరేగింపు కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త పాల్గొన్నారు. పీర్ల ఊరేగింపులో భక్తులు కుడుకలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి పత్రాల శ్రీనివాస్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు అంజయ్య యాదవ్, నాయకులు బాసంపల్లి రామాగౌడ్, పోచయ్య, పైన యాదగిరి, హరీష్, మధు పాల్గొన్నారు.

## పోరాట యోధుడు పండగ సాయన్న

**నీలం మధు ముదిరాజ్**


పోరాట యోధుడు సాయన్న విగ్రహావిష్కరణ చేసిన దృశ్యం

**పటాన్‌చెరు, జూలై 17,ప్రభాతవార్త:** నిజాం రజాకర్లకు భూ స్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాట యోధుడు పండగ సాయన్న అని నిలం మధు ముదిరాజ్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో పండగ సాయన్న చౌరస్తాలో ఏర్పాటు చేసిన పండగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డికే అరుణ, ఎమ్మెల్యేలు ఎన్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి ముదిరాజ్‌లతో కలిసి పాల్గొన్నారు. పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూ స్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండగ సాయన్న అడుగుపెడితే వారి కడుపు నింపి పండగ వాతావరణాన్ని తిసుకొచ్చిన ఘనత వల్లే సాయన్నకు పండగ సాయన్న పేరు వచ్చిందన్నారు. ముదిరాజ్ కులంలో పుట్టిన ఈ మహనీయుడు బంధుక్ ఎత్తి రజాకర్ల అన్యాయాలను ఎదిరించి ఎదురొడ్డి నిలిచి బహుజనాలకు అండగా నిలిచాడని గుర్తు చేశారు. అలాంటి మహావిరుడు సూర్తితో భవిష్యత్తు తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## 6వ రోజుకు చేరిన రైతుల రిలే దీక్షలు


రిలే నిరహార దీక్షలో కూర్చున్న భూనిర్వాసిత రైతులు తదితరులు

**నర్సాపూర్ జూలై 17, ప్రభాతవార్త :** కొండ పోచమ్మ సాగర్ నుండి సంగారెడ్డి కెనాల్‌లో భూముల కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఈ కెనాల్ అసలే మాకొద్దని డిమాండ్ చేస్తు నర్సాపూర్ అంబెడ్కర్ చౌరస్తాలో చేపట్టిన భూనిర్వాసిత రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్ష బుదవారం కు 6 వ రోజుకు చేరుకుంది. తొలిఏకాదశీ పండగ, మొహర్రం పండగలను లెక్క చేయకండా రైతుల నిరహారదీక్ష కొనసాగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూనిర్వాసిత రైతులు న్యాయం చేయాలని కోరారు. అప్పటి వరకు ఈ నిరహార దీక్ష కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ మేరకు ఈ దీక్షలో బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట రైతులు రాంకిషన్,కొండల్, నర్సింహ రెడ్డి, మహేశ్‌గౌడ్,స్వామి, అర్జున్ , శ్రీకాంత్‌రెడ్డి లతో పాటు రైతురక్షణ సమితీ జిల్లా అధ్యక్షులు పత్రాల యాదాగౌడ్ ఈ రిలే నిరహార దీక్షకు సంఘీబావం తెలిపారు.

## తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

**నర్సాపూర్, జూలై 17, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగారెడ్డి రోడ్డు గల రుస్తుంపేట కమాన్ నమాజ్ గడ్డ వద్ద వాటర్ పైప్ లైన్ పగిలి పోయినందున ఈ పలిగి పోయిన వాటర్ పైప్‌లైన్‌లను బుదవారం విషయం తెలుసుకున్న మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ స్పందించి వెంటనే సబ్బందిని పిలిపించి దగ్గరుండి ఈ పైప్‌లైన్ ను మరమ్మతులు చేయించారు. పైప్‌లైన్ పగిలిపోవడంతో నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 6,7,8,9 వార్డులలో తాగునీటి కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మేరకు ఈ వార్డుల్లో ప్రసుత్తం పైప్‌లైన్‌లమరమ్మత్తులు మున్సిఫల్ చైర్మన్‌అశోక్‌గౌడ్ అధ్వర్యంలో చేపట్టడ్డంతో ఈ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమయ్యిందని ఈ వార్డు ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మిషన్ భగీరథ వాటర్ మేనేజర్ జగపతిబాబు, సూపర్ వైజర్ వినీత్‌రాజ్, వార్డు ఆఫీసర్ ఉదయ్, దుర్గేశ్, రణ్‌దీప్, రాజు, పరుశురామ్‌రెడ్డి, జవాన్, ఎల్లం,మున్సిఫల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్

# రుణమాఫీ చేశాం..హరీష్ రాజీనామా చేయాలి

**మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**పాపన్నపేట, జూలై 17, ప్రభాతవార్త:** ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టాదారు పుసుపుస్తకాలు గల రైతులందరికి రుణాలను మాఫీ చేశారని, ఇక తన ఎమ్మెల్యే పదవికి మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు రాజీనామా చేసి రాజకీయ సన్యాసం పుచ్చుకోవాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సవాల్ విసిరారు. బుధవారం మండల పరిధిలోని బాచారం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన నలుగురు వ్యక్తుల కుటుంబాలకు 25వేల రూపాయల చొప్పున ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందచేశారు. అంతకు ముందు చిత్రియాల్ చౌరస్తాలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాపన్నపేటలోని ఎంపిపి కార్యాయలంలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెనిఫోస్టోలో చేసిన హామీ ప్రకారం రైతులకు 2 లక్షల రుణమాఫీ చేశారన్నారు. దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం రైతులు సంబరాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ నాయకుల ప్రతోబాలకు కొందరు విద్యుత్ అధికారులు అమ్ముడు పోతున్నారని, కరెంటు కోతలు ఉద్దేశపూర్వకంగా విధిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ కార్డులు లేని వారికి త్వరలోనే అందిస్తామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కొత్లపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్, అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మాజీ కో-ఆప్షన్ సభ్యులు గౌస్, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, నర్సింలు, శ్రీనివాస్ చౌదరి, బొజ్జ పవన్, నరేందర్ గౌడ్, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి సిఎల్ శ్రీనివాస్‌యాదవ్ పూజలు

**తలకొండపల్లి, జూలై 17, ప్రభాతవార్త** ఏకాదశి సందర్భంగా వెల్జాల గుట్టపైన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్‌యాదవ్ మరియు సర్పంచులు జయమ్మ వెంకటయ్య నాగమణి లింగం గౌడ్ మహేష్ మహేందర్ ప్రెస్ మిత్రులు బాలయ్య తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

## స్వయం ఉపాధితో యువకులు ఆర్థికంగా ఎదగాలి : ఎస్ఐ

**పెద్దేముల్, జులై 17, ప్రభాతవార్త:** యువత స్వయం ఉపాధితో ఆర్థికం గా ఎదగాలని పెద్దేముల్ ఎస్ఐ గిరి అన్నారు. బుదవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో దుగ్గాపూర్ గ్రామనికి చెందిన అంబుగౌడ్,వడ్డె నర్సిములు నిర్వహించిన శ్రీ బేకరిని ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గిరి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధిని ఎంచుకోవడం హర్షనీయమని అన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తు సమాయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందడంలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువత స్వయం ఉపాధి అవకాశాలను ఎంచుకొనిముందుకు సాగడం వల్ల తమ కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శంగానిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఎస్. నారాయన్‌రెడ్డి, మాజీ యంపిటిసి యాలటి శ్రీనివాస్, నాయకులు జనగాం విజయకుమార్ దుగ్గాపూర్ శ్రీనివాస్, శివకుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, మైపుస్, ఖలీల్, సోసైటి మేనేజర్ మురళిగౌడ్, గ్రామస్తులు బోయిని శ్రీనివాస్, మహబూబ్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

**కడ్తాల్, జూలై 17 ప్రభాతవార్త :** కస్తూర్బా గాంధీ పాఠశాల గురించి అహర్నిశలు కష్టపడి ప్రజలకు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ఎనలేని కృషి చేసిన ప్రజా నాయకుడు దశరథ్ నాయక్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. దీనికి రాబోయే కాలంలో తగిన గుణపాఠం చెబుతారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మోసాలను నిత్యం ప్రజలలో ఉండి ఎండగడుతున్న ప్రజలను ఏ విధంగా మోసం చేస్తుందో, విద్యార్థులను ఎంత ఇబ్బందులకు గురి చేస్తుందో ప్రతి ఒక్క మోసాన్ని ప్రజలకు చేరవేసే నీతి నిజాయితీగా పరిపాలన చేయాలని ప్రజలను నిత్యం చైతన్యవంతులను చేస్తున్న మాజీ జడ్పీటిసి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ దశరథ్‌నాయక్ ముందస్తుగా అరెస్టు చేస్తున్నామని ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా అదుపులోకి తీసుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు.

## పండుగ సాయన్నకు ఘన నివాళి

**చేవెళ్ల, జూలై 17 ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పం దుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని బుధవారం చేవెళ్ల మండల కేం ద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

**షాబాద్, జూలై 17, ప్రభాతవార్త :** దామోదర్ సంజీవయ్య సంక్షేమ భవన్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ముదిరాజ్ కో- ఆపరేటివ్ సొసైటి చైర్మెన్‌గా పదవి బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈసం దర్భంగా షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, సుభాష్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, జానీ మహ్మద్, కిషోర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## ఒడిదుడుకులను తట్టుకుని..న్యాయంవైపు నడిచిన వ్యక్తి సక్రం

**జిల్లెడు చౌదరిగూడ, జులై 17,(ప్రభాతవార్త):** ఎన్ని రాజకీయ వత్తిల్లు వచ్చిన ప్పటికి అన్ని అఒడిదుడుకులను తట్టుకుని న్యాయంవైపు నడిచిన వ్యక్తి ఎస్ఐ సక్రం అన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేసన్ ఆవరణలో ఎస్ఐ సక్రం విడుకోలు సమావేశాన్ని నిర్వహించారు. బదిలిపై వెల్తున్న ఎస్ఐ సక్రం, కానిస్టెబుల్ చందన్‌లకు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మాణం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ప్రతతి ఒక్కరు ఏదో ఒక రోజు ఒక స్థలం నుంచి మరోక స్థలానికి వెల్లక తప్ప దని అన్నారు. ఇక్కడ ఉన్నన్ని రోజులు ప్రజలకు ఎంత వరకు న్యాయం చేశామ నేది ముఖ్యమని అన్నారు. అందరి మన్ననలు పొందిన వ్యక్తులకు మాత్రమే ఇలాంటి బారి సన్మాణాలు జరుగుతాయని తెలిఎపారు. ప్రజల మనుసు గెలుసుకున్న ఎస్ఐకి ప్రతి ఒక్కరు సన్మాణం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. జిల్లెడు చౌదరిగూడ మండలానికి వచ్చిన అధికా రులకు ఇంత పెద్ద ఎత్తున సన్మాణం జరగలేదని ఇది కేవలం ప్రజలకు మెలు చేయడమేనని వారు పెర్కొన్నారు. ఇదే సమావేశంలో నూతనంగ వచ్చిన ఎస్ఐ విజయ్‌కుమార్‌కు సన్మాణం చేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**-సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య**

**యాచారం జూలై17,ప్రభాతవార్త :** మధ్యాహ్న బోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరుకుంది. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహా య కార్యదర్శి బ్రహ్మయ్య ,మండల కన్వీనర్ చందు నాయక్ మాట్లా డుతూ.....రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల మొండి వైఖరి విడాలని కార్మికుల నాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. గత 22 సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్మికులకు 6 నెలలుగా జీతాలు రాకపోవడం అరకొరగా బిల్లులు ఇవ్వడం పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బులు ఇవ్వకపోగా హెడ్‌మాస్టార్లు ,డ్వాక్రా సంఘాల వాళ్ల రాజకీయ నాయకులు వేధింపులు అరికట్టాలని ప్రభుత్వం కళ్ల తెరిచి మధ్యాహ్నం భోజన కార్మికులకు ప్రతి నెల 5వ తేది లోపు వేతనాలు బిల్లులు చెల్లించాలని సిఎం అసెంబ్లీ సాక్షిగా ఇస్తానన్న పదివేల వేతనాన్ని వెంటనే జీవో జారి చేయాలని ఒంటి కాలుపై నిలబడి కార్మికులంతా దండం పెడుతూ రెండో రోజు నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్ష,కార్యదర్శులు మల్లారి, చంద్రకళ,కార్మిక నాయకులు పద్మ,నరేందర్,కల్లమ్మ, బుజ్జమ్మ, సుజా త, లక్ష్మి,లక్ష్మమ్మ, సాలమ్మ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నం

**యాచారం జూలై17,ప్రభాతవార్త :** మహిళా మెడలో మంగళసూత్రం దొంగిలించబోయి ప్రతిఘటించడంతో దొంగలు పారిపోయే క్రమంలో గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసిన సంఘం యాచారం పోలిసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... యాచారం మండల మొగుళ్ల వంపు గ్రామానికి చెందిన చిప్పలపల్లి రజిత ప్రతాప్ రెడ్డి (56) మొగుళ్ల వంపు నుండి చౌదర్‌పల్లి వెళ్లే దారిలో ప్రధాన దారికి సమీపంలోని వ్యవసాయ పొలంలో పనిచేయడానికి వెళ్లున్న రజితను గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుకు అడ్డుంగా వచ్చి ఏదో అడిగినట్టు అడిగి మెడలో ఉన్న పుస్తెలతాడును దొంగిలించబోయే క్రమంలో ఆమె నోరు మూసి లాక్కొని వెళ్లే క్రమంలో రజిత కేకలు వేయ డంతో వారి బంధువైన సంజీవ రెడ్డి వచ్చి వారిని పట్టుకోపోయే క్రమం లో దుండగులు చేత దెబ్బలు తిన్నాడు. అప్పటికే గమనించిన చుట్టు పక్కల పొలంలో పనిచేసేవారు వచ్చి వారిని పట్టుకున్నారు. గ్రామంలో ఓ వ్యక్తి చనిపోవడంతో సమీపంలో అధిక జనాలు ఉండటం వలన వారి ని పట్టుకోగలిగారని స్థానికులు పేర్కొన్నారు. దుండగలలో ముగ్గురు వ్యక్తులు ఉండగా ఒకరు తప్పించకపోగా ఇద్దరు పట్టుపడ్డారు. గ్రామస్తులు వారిని చితక బాధినట్లు పేర్కొన్నారు. దుండగులు బుకాయిస్తూ మేము దొం గతనం చేయలేదని చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలిసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రోడ్లపై నిర్మాను ష స్థలాలలో ఒంటరిగా వెళ్లేవారు బంగారు ఆభరణాలతో ఉన్నవారు మెడపై ఏదైనా చున్నీ వేసుకొని చీర కొంగు వేసుకుని జాగ్రత్తగా వెళ్లాలని పోలిసులు సూచించారు. అవసరమైతే ఏదైనా కర్ర కొడవలి చేతుల్లో పట్టుకొని ఒంటిరిగా వెళ్లే మహిళ రక్షణ కోసం వినిగించాలని సూచన చేశారు.

## వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న యాజమాన్యాలు

**చేవెళ్ల, జూలై 17 ప్రభాతవార్త :** వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తు న్న విల్లాస్, కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిఐటి యూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్ల మండల పరిదిలోని విల్లాస్, కంపెనీలలో వలస కార్మికుల సమస్యలు తెలుసు కోవడానికి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ....చేవెళ్ల మండల పరిధిలోని వివిధ కంపెనీలు, విల్లాస్, వెంచర్‌లలో పనిచేస్తున్న వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అతి తక్కువ వేతనాలు ఇస్తూ 10 నుంచి 1 గంట లు పనులు చేస్తున్నారని అన్నారు. అనేక కంపెనీలలో ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించలేదని అన్నారు. అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979 ప్రకారం ఇతర రాష్ట్రాల కార్మికులతో పనిచేస్తున్న వారి సంరక్షణ పూర్తి బాధ్యతలు యాజమాన్యాలు తీసుకోవాలన్నారు. భోజనం,వసతి రూమ్‌ల ఏర్పాటు,పిల్లల చదువు వారి ఆరోగ్యం ఇలా అనేక వసతులు కల్పించాలని చట్టంలో ఉందన్నారు. కానీ ఈ చట్టానికి విరుద్ధంగా రేకుల షెడ్డులలో వసతి ఏర్పాటు చేస్తున్నారని మహిళలకు బాత్రూంలు, స్నానపు గదులు కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వారాంతపు సెలవులు ఇవ్వకుండా నెలకు రెండు క్యాజువల్ లీవ్స్ ఇవ్వకుండా పనులు చేయిస్తున్నటువంటి కంపెనీల, విల్లాస్ యాజమాన్యాలపై కార్మికశాఖ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

## హుస్నాబాద్‌లో సిఎం, మంత్రులకు క్షీరాభిషేకం


సిఎం, ఆరోగ్యశాఖ మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆర్ఎంపిలు

**హుస్నాబాద్, జూలై 17, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆర్ఎంపి,పిఎంపిల వైద్య సేవలను గుర్తించడం హర్షదాయకమని హుస్నాబాద్ మండల గ్రామీణ వైద్యుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గీకురు వెంకటేశం అన్నారు. బుదవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్ఎంపి,పిఎంపిలకు శిక్షణ ఇప్పించేందుకు నూతన జీవో తీసుకొస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో తాము ప్రజలకు అండగా నిలిచి వ్యాది గ్రస్తులకు తమ సూచనలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కరోనా సమయంలో వ్యాది సోకిన వారికి సహాయం చేసేందుకు వెళ్లి ఎంతో మంది ఆర్ఎంపిలు తమ ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారని వారి కుటుంబాలను సైతం ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సైతం తాము ప్రజలను చైతన్యం చేసి రాష్ట్రం కోసం పోరాడితే గత ప్రభుత్వంలో వారికి గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన మరణించిన తర్వాత ఆర్ఎంపి,పిఎంపిల బ్రతుకులకు భరోసా లేకుండా పోయిందన్నారు. ఆయన ఆశయాల సాధనక కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు వస్తున్నారని ఆర్ఎంపి ,పిఎంపిలకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని ఇందుకు జీవో కూడా విడుదల చేస్తామని ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు సుదర్శన్,ప్రధాన కార్యదర్శి బంక చందు,కోశాధికారి ముంతాజ్,కనుకుంట్ల శ్రీనివాస్,బింగి శ్రీనివాస్,బాలయ్య,కోడం ఆంజనేయులు,పరశురాం,ప్రకాష్,కృష్ణ,రమేష్,రఘు,రాములు,శ్రీనివాస్,రమేష్,రాజేశం,సంపత్,శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


రుక్మిణి పాండురంగ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

## ఘనంగా తొలిఏకాదశి వేడుకలు

**భక్తులతో కిటకిటలాడిన రుక్మిణ పాండురంగ ఆలయం**

**జహీరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** ఆశాడతొలి ఏకాదశి పర్వదినాన్ని పురష్కరించుకుని పట్టణంలోని శ్రీ రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిట లాడింది. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని వేదబ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు బెజుగం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి నామా రవికిరణ్, కోశాధికారి అల్లాడి కృష్ణ, ఉపాధ్యక్షులు మాడిశెట్టి శ్రీనివాస్, బాలచందర్, సలహాదారు మంకాల్ సుభాష్, మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారంవార్ కల్పన, మ్యాడం పద్మ తదితరులు పాల్గొన్నారు.

### తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అందోలు రంగనాథస్వామి ఆలయంలో అభిషేకానికి హాజరైన భక్తులు

**జోగిపేట, జూలై 17, ప్రభాతవార్త:** తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారంనాడు జోగిపేట, అందోలుతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అందోలులోని రంగనాథ స్వామి ఆయలంలో వేకవజామునే తొలి ఏకాదశి సందర్భంగా అభిషేకం నిర్వహించారు. తొలిఏకాదశి ప్రత్యేకతవల్ల పలుఆలయాలకు భక్తుల సందడి ఎక్కువైంది. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. దీంతో దాదాపు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

## అధ్వానంగా తోపుగొండ రోడ్డు



**కంది, జూలై 17, ప్రభాతవార్త:** మండలంలోని కాశీపూర్ నుంచి తోపు గొండకు వెళ్లే రోడ్డు ఆధ్వాన స్థితికి చేరుకోవడంతో రోడ్డుపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుండా ఓ వైపు ఎత్తుగా ఉండటం, మరో వైపు కుంట, వ్యవసాయ పొలాలు ఉండటంతో ప్రయాణించేందుకు నిత్యం పాట్లు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎదరుగా వచ్చిన వాహనాలకు (పాఠశాల బస్సులు, వ్యానులు తదితర నాలుగు చక్రాల వాహనాలు) దారి ఇచ్చేందుకు ఇబ్బందులకు గురికాక తప్పడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని కాశీపూర్, తోపుగొండ, కవలంపేట, చేర్యాలగూడెం గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

**ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్**

**కేశంపేట,జూలై 17, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసేందుకు రేషన్‌కరార్డును ప్రామాణికంగా చేసుకోవడం విడ్డూరంగా ఉందని కేశంపేట మండలం లింగంధన గ్రామనికి చెందిన కొత్తపేట పాక్స్ డైరెక్టర్ మధుసూదన్ గౌడ్ అన్నారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డు మంజూరే కాలేదని గ్రామాల్లో చాలామందికి రేషన్ కార్డులు లేవన్నా రు. మొదటగా ప్రజలకు రేష న్ కార్డులను మంజూరు చేయాల న్నారు. రేష్‌కార్డులతో సంబంధం లేకుండా రుణాలు తీసుకున్న రైతుకు రుణ మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రేషన్‌కార్డులతో సబంధం లేకుండా రుణమాఫీ జరిగేలా చూడాలని కోరారు.

## ఓం స్వామియే శరణమయ్యప్ప

**రూ.2,00000 గురుస్వామి గిరీష్‌నాయర్‌కు అందజేసిన తుమ్మల జ్యోతి నర్సింలు యాదవ్ దంపతులు**

**నందిగామ, జూలై 17, ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో గురుస్వామి గిరీష్ నాయర్ కు బుధవారం రూ. 200000లను తుమ్మల జ్యోతి నర్సింహులు దంప తులు అందజేశారు. 2023 డిసెంబర్ 27న అప్పట్లో అయ్యప్ప స్వా మి పడిపూజలో రూ.3,63,000లకు వేలంపాటపాడారు. పవిత్ర తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో రెండు లక్షల రూపాయలను గురుస్వామికి అందజేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లెల్ల బాల్‌రెడ్డి బంటారం సుదర్శన్‌గౌడ్ దేపల్లె కుమార్ గౌడ్ ఏశ్రీకాం త్ గౌడ్ కొమ్ము కృష్ణ ఎం రమేష్ నరసింహగౌడ్ అంజియాదవ్ పాల్గొన్నారు.

## శంషాబాద్ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడిగా జితేందర్

**శంషాబాద్, జూలై 17, ప్రభాతవార్త** శంషాబాద్ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడిగా టి జితేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ సభ్యుల తీర్మానం చేశారు. శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన అధ్యక్షు టిజితేందర్, ఉపాధ్యక్షుడు రాజేందర్ ప్రధానకార్యదర్శి నరేష్ క్యాదర్శిగా శ్రీనివాస్ కోశాధికారిగా లింగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సలహాదారులుగా యాదగిరి వెంకటేష్ రమేష్ మోహన్‌రెడ్డి రాజేందర్ వెంకటరెడ్డి కిట్టు రాజు కెఎల్ ఆర్ ఎన్నికైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**శంషాబాద్, జూలై 17, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లలో రాజేంద్రనగర్ శాసనసభ నియోజకవర్గానికి చెందిన బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కాగా అయనను బుధవా రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను శంషాబాద్ మండల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను కలిసి శుభా కాంక్షలు తెలిపిన వారిలో శంషాబాద్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మొహమ్మద్ నసీరుద్దీన్ రాజేంద్రనగర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుంటి ప్రవీణ్‌కుమార్ (మెట్టు) మన్నెమధు కిరణ్ తదితరులు ఉన్నారు.


పట్టణంలో తిరుగుతున్న వీధి

## సిద్దిపేటలో రోడ్లపై కుక్కల స్వైరవిహారం

### పట్టించుకోని అధికారులు.. భయభ్రాంతుల్లో ప్రజలు

**సిద్దిపేట అర్బన్, జూలై 17, ప్రభాతవార్త:** సిద్ది పేట మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. వీధికుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తున్నా పట్టించుకునే నాధుడులేడు. ఎంతో మంది బాటసారులు, వాహన దారులు వీధి కుక్కల కాటుకు బలైన సంఘటనలు ఉన్నాయి. కుక్కల భయంతో రోడ్లపైకి రావాలంటే బాటసారులు, వాహనదారులు జంకుతున్నారు.

**వీధి కుక్కలను తరలించండి : కౌన్సిలర్**

సిద్దిపేట పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆరుబయట ఆడుకోవడానికి వచ్చిన చిన్నారులపైనా, బాటసారులపై వీధి కుక్కలు వెంబడించి కరుస్తున్నాయని కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం అన్నారు. వార్డులో తిరిగే వీధి కుక్కలను ఎనిమల్‌బర్త్ కంట్రోల్ కేంద్రాలలో ఉంచి వాటిని సంరక్షణ చేయాలన్నారు. లేదా పట్టణానికి దూరంగా ఉన్న ఖాళీ స్థలంలోకి వీధి కుక్కలను తరలించి వాటికి అహారం అందించడానికి సామాజిక సేవా సంస్థలు దాతల సహకారాన్ని తీసుకోవాలన్నారు. కుక్కలకు యాంటీ రాబిస్ ఇంజక్షన్లు వేయాలన్నారు. పశుసంవర్థక, మున్సిపల్ అధికారులు సమన్వయంతో కుక్కల బెడదను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఆషాడ తొలి ఏకాదశి

**న్యాల్‌కల్, జూలై 17, ప్రభాతవార్త:** ఆశాడ తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని రాంతీర్థం గ్రామంలోని అతిపురాతనమైన రుక్మిణి సమేత పాండు రంగ స్వామి ఆలయంలో, ముంగి గ్రామ శివారులోని ఆదిలక్ష్మి ఆశ్రమం లోని రుక్మిణి, పాండురంగస్వామి ఆలయాలను మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. రాంతీర్థం ఆలయంలో ఆలయ అర్చకులు నారాయణ మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు

**నేడు ద్వాదశ వేడుకలు...**

మండలంలోని రాంతీర్థం గ్రామంలోని పాండురంగ రుక్మిణి ఆలయంలో ప్రతి ఏటా ఆశాడ తొలి ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను గ్రామ భక్తులు ఘనంగా జరుపుకుంటూ ఉంటారు. ఏకాదశి పర్వదినాన్ని ఉపవాస దీక్షలు ఉండి ఆలయంలో రాత్రికి భజనకార్యక్రమాలు నిర్వహించడం, గురువారం ద్వాదశి పర్వదినాన్ని పురష్కరించుకుని ఆలయం నుంచి అందంగా అలంకరించిన పల్లకిలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించుకుని గ్రామంలోని పురవీధుల గుండా భజనలు చేస్తూ పల్లకి సేవ నిర్వహించ డం, ఆలయ ఆవరణలో ఉట్టిని పగలకొట్టడం, ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (పాయసం) చేయడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం సైతం గ్రామంలో పల్లకి ఉరేగింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఘనంగా తొలి ఏకాదశి పండగ

**అల్లాదుర్గం, జూలై 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆశాడ తొలిఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.అల్లాదుర్గంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో, ముస్తాపూర్‌లోని రామాలయంలో, చిల్వెరలోని రామాలయంలో భక్తులు ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమహావిష్ణువు పాలకడిలలో యోగ నిద్రకు ఉపక్రమించే రోజునే తొలి ఏకాదశిగా జరుపుకుంటారని అర్చకులు పేర్కొన్నారు.

**కంగ్టిలో...**


కంగ్టిలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

**కంగ్టి, జూలై 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రజలు తొలి ఏకాదశి సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఏకాదాశి సందర్భంగా గ్రామం పోలిమేర చుట్టు విట్టల రుక్మిణి నామంతో తిరిగి విఠలేశ్వరుక్మిణి మందిరాన్ని వచ్చి భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉప వాస ప్రార్థనలు నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. గ్రామంలో చిన్న పెద్దతేడా లేకుండా భజనకార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం ఆయా మందిరాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

**నారాయణఖేడ్ టౌన్, జూలై 17, ప్రభాతవార్త:** ఆశాడ మాస తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలపరిధిలోని సంజీవరావుపేటలో కొలువున్న శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి దేవాలయానికి భక్తులు చేరుకుకుని అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని రంగురంగు పూలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయంలో రాత్రికి భజనలు చేస్తామని భక్తులు పేర్కొన్నారు.

**సిర్గాపూర్‌లో...**


శ్రీగజేంద్ర భారతి ఆశ్రమంలో తొలిఏకాదశిని జరుపుకుంటున్న భక్తులు

**సిర్గాపూర్, జూలై 17, ప్రభాతవార్త:** ఆశాడమాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. సిర్గాపూర్‌లోని శ్రీ గజేంద్ర భారతి ఆశ్రమంలో ఏకాదశిని పురష్కరించుకుని రుక్మిణి పాండురంగ స్వామిని రంగు రంగు పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాంప్రదాయ బద్దంగా రాత్రికి భజనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సరిహద్దులోని నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకరణ్ గజేంద్ర భారతి మహారాజ్ తనయులు జ్ఞానేశ్వర్ మహారాజ్ హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు.

**చిన్నశంకరంపేట మండలంలో...**

**చిన్నశంకరంపేట, జూలై 17,ప్రభాతవార్త:** మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు ఆలయాల్లో పూజలు చేశారు. చిన్నశంకరంపేటలోని శ్రీసోమేశ్వరాలయంతోపాటు మండల పరిదిలోని వివిధ దేవాలాయల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో ఉపవాసదీక్షను విరమించారు.

## సదాశివపేటలో ఉచిత వైద్య శిబిరం

**సదాశివపేట, జూలై 17, ప్రభాతవార్త:** పట్టణంలోని కోట హనుమాన్ ఆలయంలో బుధవారం మెడిస్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. శిబిరానికి చేరుకున్న ప్రజలకు ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెఇస్టార్ ఆసుపత్రి డాక్టర్ పోల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణ మాఫీ

### డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్‌యాదవ్


సిఎంతో పాటు మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నకోదూరు, జూలై 17, ప్రభాతవార్త :** గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి అన్నట్టుగానే రైతులకు రుణమాఫీ చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకుందని డీసీసీ ప్రధాన కార్యదరి ్శ మీసం నాగరాజుయాదవ్ అన్నారు. చిన్నకోదూరులో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు దామోదర రాజ నర్సింహ, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర ్భంగా మీసం నాగరాజు యాదవ్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని..రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సిఎం రేవంత్‌రెడ్డి రుణ మాఫీ చేస్తున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మాట నిలబెట్టుకొని రాజీనామా చేయాలన్నారు. రాబోయే రోజుల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొరిమి రాజు, ఉడుత జయంత్,గణేష్, కొమ్ము ప్రశాంత్, చంద్‌పాషా, ఉడుత ప్రశాంత్, గుండు వెంకట్,50 నక్క రాజు, సంతప్, మల్లేశం, వినోద్, అనిల్, స్వామి, రమేష్, రాకేష్, గణేష్,

## నేడు రైతు రుణమాఫీ సంబరాలు

### -హాజరుకానున్న ఎంపి, ఎమ్మెల్యే

**మనూర్, జూలై 17, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన మండల కేంద్రం లోని రైతువేదికలో సాయంత్రం 4 గంటలకు రైతు రుణమాఫీపై రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తారని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ సంగమేశ్వర్ తెలిపారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపి సురేశ్‌కుమార్‌శెట్కార్, నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయవంతం చేయాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

**చౌటకూరులో...**

**చౌటకూరు, జూలై 17, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన రైతులకు రూ.1 లక్ష పంటరుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీచేస్తున్నందున గ్రామాల్లోని రైతు వేదికలో రైతులు సంబరాలు జరుపుకునేందుకు తగు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా సూచనల మేరకు కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాల్లో గురువారం సంబరాలు చేసుకునేందుకు రైతులను సన్నదం చేస్తున్నారు.

**నేడు చెక్కుల పంపిణీ...**

చౌటకూరులోని రెవెన్యూ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన ఉదయం 10.30 గంటలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చౌటకూరు కమిటీ అధ్యక్షులు వరకాల రమేష్ తెలిపారు. కార్యక్రమానికి మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ ఉప సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

**గొంగ్లూర్‌లో...**

**పుల్కల్, జూలై 17, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన మండల పరిధిలోని గొంగ్లూర్ రైతువేదికలో మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్‌తో చర్చించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు సంబరాలు చేసుకునేందుకు తగు ఏర్పాట్లు చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మండల కాంగ్రెస్ నాయకులు సూచించారు.

## ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నేతలు


ఎస్ఐ సాయిలును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నాగల్‌గిద్ద, జూలై 17, ప్రభాతవవార్త:** నాగల్‌గిద్ద పోలీసు ఠాణాలో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన డి.సాయిలును కాంగ్రెస్ నాయకులు బుధ వారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. మండలంలో శాంతి భద్రతలకు తమ వంతు సహకారం అందిస్తామని సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజి రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు రూప్‌సింగ్, మాజీ సర్పంచ్ గుండేరావు, విఠల్ రావు, శాంతయ్యస్వామి, అనిల్, మాజీ ఎంపి టిసి పండరినాథ్, సంజీవ్ పాటిల్, నర్సప్ప, పూదులల్, శాంతయ్యస్వామి, రాజు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఓంకార్, సోపాన్‌రావు, సంతోష్ పాటిల్, సచిన్ పాటిల్, పండరి ఔదాత్‌పూర్, మనోహర్‌పాటిల్, నారాయణజాదవ్, దేవరెడ్డి, గణపతి రావుపాటిల్, బస్వారాజ్‌పాటిల్, రవీందర్, విఠల్‌రావు, కుశల్‌రావు, హన్మంత్, అబ్రేస్, సోందాష్, ప్రదీప్, విజయ్‌కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన శివాలయంలో తొలి ఏకాదశి పూజలు

**మెదక్ అర్బన్, జూలై 17 ప్రభాతవార్త:** తొలి ఏకాదశి పురస్కరించుకొని మెదక్ పట్టణంలోని ప్రాచీన శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాండ్ల సాయిబాబా కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పూజా క్యాక్రమాలు నిర్వహించారు. దోర్భల కుమార స్వామి భక్తులకు శ్రీకృష్ణుని ప్రవచనాలు వినిపించారు. ఆలయ ప్రాంగణమంతా రాధే గోవిందా నామ స్మరణతో మారుమ్రోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డివిజన్ అధ్యక్షులు దేశాయిపేట లింగమూర్తి శర్మ, జిల్లా కార్యదర్శి వైద్య శ్రీనివాస్, పోద్దారి నరేందర్, రామేశ్వరప్రసాద్ శర్మ, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### వెల్దుర్తి మండలంలో...

**వెల్దుర్తి, జూలై 17 ప్రభాతవార్త:** ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పండుగను బుధవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలు, ఇళ్లలో పూజలు నిర్వహించి పిండి వంటలు చేసుకున్నారు. మండల పరిధిలోని మానెపల్లి గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ప్రజలు, భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

**కొల్చారం మండలంలో...**

**కొల్చారం, జూలై 17 ప్రభాతవార్త:** ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పండుగను బుధవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలు, ఇళ్లలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఇళ్లల్లో పిండి వంటలు చేసుకున్నారు. ఒకరికొకకు తొలి ఏకాదశి శుభాకంక్షలు తెలుపుకున్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**

**న్యాల్‌కల్, జూలై 17, ప్రభాతవార్త:** మండల కేంద్రతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం ఆశాడ తొలిఏకాదశి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. రేజింతల్ గ్రామ శివారులోని శ్రీ సిద్దివినాయక, రాఘవాపూర్ గ్రామ శివారులోని శ్రీ పంచవటి క్షేత్రంలో, మల్గి గ్రామంలోని సిద్దేశ్వర, పాండురంగ స్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఆర్థిక సహాయం అందజేసిన మాజీ జడ్‌పిటిసి

శివ్వంపేట, జూలై17 ప్రభాతవార్త: శివ్వంపేట మండలంలోని బోజ్యా తండాకు చెందిన మాలోత్ సాజి అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త తన సొంత నిధులు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అదే తాండకు చెందిన ఎల్. సుగుణ అనారోగ్యంతో బాధపడుతున్నందున ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, నాగేషన, పాండు, మాలోత్ సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


కెడిసిసి బ్యాంకు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

### రైతులకు మెరుగైన సేవలు అందించడానికే

## నూతన భవన నిర్మాణం : ఎమ్మెల్యే

**బెజ్జంకి, జూలై 17,ప్రభాతవార్త:** మండలకేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంకు బెజ్జంకి మండల శాఖ నూతన భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే డా॥కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా॥ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి నూతన భవనం నిర్మించడం జరుగుతుందన్నారు. నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన చైర్మన్ తన్నీరు శరత్‌రావు, సీఈఓలను అభినందించారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఈఓ, పిఏసిఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, పులి కృష్ణ, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, లింగాల శ్రీనివాస్, బైరి సంతోష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు పక్ష పాతి సిఎం రేవంత్‌రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

**తొగుట, జూలై 17, ప్రభాతవార్త :** రైతు పక్షపాతి సిఎం రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతుల పక్షపాతి సిఎం నిలుస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రాలలో మొదట డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులు, రైతులతో బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండోరోజు మండల కేంద్రాలలో, మూడో రోజు గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీలు చేసి రైతులకు చేస్తున్న రుణ మాఫీపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులకు అగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతుందన్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రభుత్వం చేసి తీరతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న రుణమాఫీ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈనెల 18న జరిగే బైక్‌ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా ఏకలవ్యుని జయంతి


ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జూలై 17,ప్రభాతవార్త:** ఏకలవ్యుని జయంతి వేడుకలను ఎరుకల సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఏకలవ్యుని జయంతి సందర్భంగా మండల పరిధి చందంపేట గ్రామంలో ఆయన చిత్రపటానికి ఏరుకల సంఘం నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకాగ్రతలో విలు విద్యను అభ్యసించి రాణించిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, రమేష్, శ్రీనివాస్,శ్రీకాంత్,ప్రశాంత్,గణేష్‌లు పాల్గొన్నారు.

## యాదగిరి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

గజ్వేల్, జూలై 17 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో గతకొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మంగలి యాదగిరి మృతిచెందాడు. బుధవారం మృతుని కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదగిరి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, ఆయన పిల్లలను ఉన్నత చదువులు చదివించే బాధ్యత నేను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. యాదగిరి మరణం బాధాకరమని తన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ మండల అధ్యక్షుడు బయ్యారం మల్లారెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు క్యాసారం బాబా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## గజ్వేల్ పట్టణంలో షర్బత్ పంపిణీ

**గజ్వేల్, జూలై 17 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలో మొహర్రం పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహ్మద్ ఇక్బాల్, నాయకుడు సయ్యద్ మతీన్ ఆధ్వర్యంలో శర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ముస్లీంలు సంతోషంగా జరుపుకునే పండుగ మొహర్రం అని, ప్రతి సంవత్సరం మొహర్రం పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ సోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### రుణమాఫీ సంబరాలను విజయవంతం చేయాలి : ఎడిఎ

**గజ్వేల్, జూలై 17 (ప్రభాతవార్త):** రైతులకు మొదటి విడత రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం మధ్యాహ్నం గజ్వేల్ డివిజన్ పరిధిలోని అన్ని మండలకేంద్రాల్లో గల రైతు వేదికల్లో రుణమాఫీ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని ఏడిఏ బాబునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగా గజ్వేల్ మండల పరిధిలోని 2826 మంది రైతులు, కొండపాక మండలంలో 2932 మంది రైతులు, రాయపోల్ మండలంలో 2351 మంది రైతులకు రుణమాఫీ కానుందని తెలిపారు. రుణమాఫీ సంబరాలకు డివిజన్ పరిధిలోని రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


చౌటకూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

## త్యాగానికి ప్రతి రూపమే మొహర్రం

**చౌటకూరు, జూలై 17, ప్రభాతవార్త:** త్యాగానికి ప్రతి రూపకంగా జరుపుకునే మొహరం పండగను బుధవారం చౌటకూరుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ప్రతిష్టించిన పీర్ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో పీర్లను యువకులు కేరింతలు కొడుతుండగా భాజలు కొడుతూ, మజ్జు ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ గ్రామాల్లోని పురవీధుల గుండా ఊరేగించారు. కులమతాలకు అతీతంగా చిన్న పెద్ద, ఆడ మగ తేడా లేకుండా ప్రజలు పండగలో పాల్గొని పీర్లను దర్శించుకున్నారు.

**మనూరు మండలంలో...**

**మనూర్, జూలై 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం మొహరం పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీర్లను భక్తులు దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల్లో భాజల కొడుతుండగా పీర్లను యువకులు కేరింతలు కొడుతూ గ్రామాల్లోని పురవీధుల గుండా ఊరేగించారు.

**కల్హేర్ మండలంలో...**

**కల్హేర్, జూలై 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రజలు పీర్ల పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆలయ్ బలయ్ ఆడుతూ మజీన, కోలాటలు ఆడుతూ పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఉదయం నుంచి తయారు చేసిన దూదిపీర్‌ను వాడ వాడలా ప్రదర్శిస్తూ పండుగను జరుపుకున్నారు.

**నారాయణఖేడ్...**

నారాయణఖేడ్ పట్టణంతోపాటు ఆయా గ్రామల్లో పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి చిన్న పెద్దతేడా లేకుండా దూదిపీర్‌ను రంగు రంగులుగా తయారు చేసి ఆయా గ్రామాల్లో ఉంచారు. మధ్యాహ్నం నుంచి సీరతలు, ఆలయ్‌బలయ్, మజీన,తదితన కార్యక్రమాలు నిర్వహించి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

**ముక్తాపూర్‌లో...**

**నాగల్‌గిద్ద, జూలై 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం మోహరం పర్వదినాన్ని పురష్కరించుకుని పీర్ల పండగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మజీదుల వద్ద కూర్చోబెట్టిన భీ ఫాతిమా దూద్‌పీరు, హుస్సేన్ పీర్లను భక్తులు భక్తి శ్రద్దలతో దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ముక్తాపూర్‌లో ప్రతిష్టించిన పీర్లను గ్రామంలోని పురవీధుల గుండా మజ్జు ఆడుదూ పాటలు పాడుతూ కేరంతలు వేస్తూ ఊరేగించారు.

**చిన్నశంకరంపేట మండలంలో...**


ఖాజాపూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట,జూలై 17,ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. హిందూ, ముస్లిం తేడా లేకుండా అందరు భక్తిశ్రద్ధలతో మోహర్రం పండుగను జరుపుకున్నారు. ముస్లింలు మజీదులు, దర్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మజీదుల వద్ద పీర్లను ప్రతిష్టించి గ్రామ పురవీదుల్లో ఊరేగించారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**కొల్చారం మండలంలో...**


పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

**కొల్చారం, జూలై 17 ప్రభాతవార్త:** మండలంలో బుధవారం పీర్ల పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కొల్చారం, రంగంపేట్‌లతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. రంగంపేట్‌లో మసీదు వద్ద నూతన వస్త్రాలు, పూలు, దూదితో అలంకరించిన హసేన్, హుస్సేన్,ఆశన్న, ఉషన్న ధూది పీర్లను దప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా గ్రామ పంచాయితీ సమీపానికి తీసుకువచ్చారు.అనంతరం షరబత్‌ను పంపిణీ చేశారు. హిందూ, ముస్లింలు సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా అసైదులు అంటూ పాటలు పాడుతూ, దూల ఆడుతూ మొహర్రం వేడుకలు జరుపుకున్నారు. మహిళలు మలీద, దర్తీ, ఒడి బియ్యం సమర్పించి మొక్కలను చెల్లించుకున్నారు.

**ములుగు మండలంలో...**


పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

**ములుగు, జూలై 17 (ప్రభాతవార్త):** మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ములుగులో దప్పుచప్పుళ్లతో పీరీలను ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు పీరీలకు ధట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**జోగిపేటలో...**

**జోగిపేట, జూలై 17, ప్రభాతవార్త:** అందోలులో మొహర్రం వేడుకలను బుధవారంనాడు ఘణంగా జరుపుకున్నారు. మండలంలోని డాకూరులో ఈ పండగను ఘణంగా నిర్వహించారు. మండలంలోనే డాకూరులో ఈ పండగ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయమే పీర్ల ఊరేగింపు నిర్వహించారు. జోగిపేట పట్టణంలో శివాజీరోడ్డులోని దూద్‌పీరు ఊరేగింపును ఉదయం ఘణంగా నిర్వహించారు. దూల ఆట, మహిళల నృత్యాలమధ్య పీర్ల ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. తూర్పుగౌనికి సంబంధించి పెద్దపీరు ఊరేగింపుకూడా భారీస్థాయిలో జరిగింది. వీటి ఊరేగింపును చూసేందుకు జనం భారీసంఖ్యలో హాజరయ్యారు. పీర్ల ఊరేగింపు సందర్భంగా పలువురు శర్బత్ పంపిణీ చేశారు.కాగా రెండు పీర్ల కలయిక అనంతరం తిరిగి మళ్లీ యదాస్థలాలకు పీర్లను తీసుకెళ్లారు. కాగా జోగిపేటలో రాత్రి అందోలు నుంచి పీరుతో జోగిపేటకు చెందిన దూద్ పీర్ కలయిక జోగిపేట పట్టణంలోని గౌనిచౌరస్తాలో అర్ధరాత్రి జరుగుతుంది. ఇందుకోసం భారీస్థాయిలో జనం అక్కడ గుమిగూడతారు. మొత్తానికి మొహర్రం వేడుకలను మండలంలోని అన్నిగ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.